సాక్షి ప్రకాశం
మంగళవారం । 25 । జూలై । 2023



రూ.23 లక్షలకు టోపీ

హౌసింగ్ లోన్ ఇప్పిస్తానని చెప్పి నమ్మించి ఓ వ్యక్తి తన వద్ద నుంచి రూ.23 లక్షలు స్వాహా చేశాడంటూ గిద్దలూరుకు చెందిన ఒకరు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. - 8లో..



జగన్ పాలనలోనే అభ్యున్నతి

సీఎం జగన్ పాలనలోనే సంచార జాతులు అభ్యున్నతి సాధించాయని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29/26

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

ప్రకాశం.. పాడిపరిశ్రమకు పుట్టినిల్లు. జిల్లాలో అత్యధిక శాతం మంది పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు వైభవంగా వెలుగొందుతున్న పాడి పరిశ్రమకు చంద్రబాబు పద్ధతి ప్రకారం 'పాడె' కట్టారు. ఒంగోలు డెయిరీ ఒకప్పుడు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని ఒక వెలుగు వెలిగింది. పాడి రైతులకు కాసుల వర్షం కురిపించింది. ఇంతటి పేరు ప్రఖ్యాతులు ఉన్న డెయిరీని చంద్రబాబు ప్రభుత్వం నిలువునా ముంచేసింది. తన హెరిటేజ్ కోసం దీనిని నిర్వీర్యం చేశారు. సుదీర్ఘకాలం పాటు ఉన్న టీడీపీకి చెందిన పాలక మండలి రూ. 100 కోట్లు దోచేసి అటు కార్మికులను, ఇటు పాడి రైతులను రోడ్డుమీద పడేసింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉద్యోగులు, కార్మికుల కష్టాలు తీర్చేందుకు, బకాయిలు చెల్లించేందుకు రూ. 69 కోట్లు యుద్ధ ప్రాతిపదికన నిధులు విడుదల చేశారు. అమూల్ సంస్థ ద్వారా పాడి రైతులకు ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారు. నాడు డెయిరీ రంగంలో నంబర్ వన్‌గా ఉన్న డెయిరీని మూసేసి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత తెరిపిస్తామని నారా లోకేశ్ శుష్క వాగ్దానాలు ఇస్తున్నారని జిల్లా వాసులు మండిపడుతున్నారు.

హెరిటేజ్ బాబు పాపాలు



- ఒంగోలు డెయిరీని దివాళా తీసిన టీడీపీ
- సహకార రంగం నుంచి కంపెనీ యాక్ట్‌లోకి మార్చిన వైనం
- పాలకమండలి ద్వారా రూ.100 కోట్లు దోచేసి డెయిరీ నిర్వీర్యం
- ఆస్తులన్నీ తనఖా పెట్టి.. అప్పుల ఊబిలోకి నెట్టిన చంద్రబాబు
- పథకం ప్రకారం దెబ్బతీసి 35 వేల మంది పాడి రైతులకు అన్యాయం
- ఒంగోలు డెయిరీకి సీఎం వైఎస్ జగన్ చేయూత
- ప్రత్యేక జీఓ ద్వారా రూ.69 కోట్లు విడుదల...
- అప్పులు, ఉద్యోగుల జీతాలు, పాడి రైతుల బకాయిలు చెల్లింపు
- అమూల్ ద్వారా జిల్లా పాడి రైతులకు అండ
- వంద రోజుల్లో తెరుస్తానంటూ లోకేశ్ అబద్ధాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు డెయిరీలో ఒకప్పుడు ఏటా రెండున్నర కోట్ల లీటర్ల పాలు జిల్లాతో పాటు రాష్ట్ర సరిహద్దులు దాటేవి. అలాంటి దీనిని టీడీపీ పాలకులు నిలువునా ముంచేశారు. తమ స్వార్థం కోసం ఒట్టిపోయిన గేదెలా తయారు చేశారు. సొంత పాల వ్యాపారాన్ని విస్తృత పరుచుకోవటానికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పన్నిన కుట్రలో చిక్కుకుని విలవిల్లాడింది. 2014లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టే వరకూ టీడీపీ నాయకుడు చల్లా శ్రీనివాసరావు చైర్మన్‌గా పాలక మండలి కొనసాగుతూనే ఉంది. నాడు బాబు కుట్రలతో సుదీర్ఘకాలం పాటు ఉన్న పాలక మండలిని అడ్డుపెట్టుకుని అంచెలంచెలుగా నిర్వీర్యం చేస్తూ వచ్చారు.

సహకార రంగం నుంచి కంపెనీ చట్టంలోకి....

2013లో చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఒంగోలు డెయిరీ టీడీపీ పాలక మండలి ఆధ్వర్యంలో నడిచేది. అప్పుడే చైర్మన్‌ను, ఎండీని పిలిపించుకున్న చంద్రబాబు డెయిరీని కంపెనీ చట్టంలోకి మార్చమని హుకుం జారీ చేశారు. పాలక మండలిలోని సభ్యులందరూ టీడీపీ వాళ్లే కావడంతో అప్పటికప్పుడు కంపెనీ యాక్ట్‌లోకి మార్చేశారు. ప్రకాశం జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి లిమిటెడ్ కాస్తా ప్రకాశం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌గా మారిపోయింది. అప్పటి వరకు పాలు అమ్ముకోవడం ద్వారా వచ్చిన డబ్బును స్వాహా చేసిన డెయిరీ పాలక వర్గం 2016–17 ఆర్థిక సంవత్సరంలో రూ.7.29 కోట్లు నష్టం వచ్చిందంటూ లెక్కలు తేల్చారు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో మరో రూ.58.34 కోట్లు నష్టం వచ్చిందని చూపించారు. మొత్తం కలుపుకొని రూ.65.63 కోట్ల నష్టాల ఊబిలోకి కూరుకుపోయింది. ఇలా డెయిరీని కోలుకోలేని విధంగా పీకల్లోతు నష్టాల్లోకి నెట్టేశారు.

నాడు పాలక మండలిని అడ్డుపెట్టుకుని డెయిరీని నాశనం చేసి నేడు వంద రోజుల్లో తెరిపిస్తానంటూ జిల్లాలో పాదయాత్ర చేస్తున్న లోకేష్ చెబుతూ ప్రజలను ఏమారుస్తున్నాడు.

ఒకప్పుడు పాలవెల్లువ:

ఒంగోలు డెయిరీని ప్రారంభించినప్పటి నుంచి పాలు వెల్లువలాగా డెయిరీకి వచ్చేవి. పాలు విరివిగా వస్తున్నా వచ్చిన లాభాలను అప్పనంగా కాజేసి పాలక మండలి మాత్రం నష్టాలు మాత్రమే చూపించింది. నష్టాల్లో ఉందని చెబుతున్నా 2017–18 ఆర్థిక సంవత్సరంలో 71.23 లక్షల లీటర్ల పాలు సేకరించింది. అంతకు మందు ఏ సంవత్సరంలో కూడా సంవత్సరానికి పాలు 2 కోట్ల లీటర్లకు ఎప్పుడూ తగ్గలేదు. 2010–11 సంవత్సరంలో 2.31 కోట్ల లీటర్ల పాలు, 2011–12లో 2.67 కోట్ల లీటర్ల పాలు సేకరించేవారు. చివరకు 2016–17లో రూ.7.29 కోట్ల నష్టం చూపించిన సంవత్సరంలో కూడా 2.34 కోట్ల లీటర్ల పాలు సేకరించారంటే డెయిరీ పూర్వవైభవం ఏవిధంగా ఉందో అవగతమవుతుంది.

డెయిరీ ఆస్తులు తాకట్టు

చంద్రబాబు నాయుడు తిరిగి 2014లో ముఖ్యమంత్రి అయిన తరువాత ఏకంగా డెయిరీ ఆస్తులన్నీ తాకట్టు పెట్టించారు. డెయిరీలో వచ్చిన లాభాలన్నీ కాజేసి చివరకు నష్టాలు వచ్చాయని చూపించారు. డెయిరీని ఆదుకుంటున్నామంటున్న నెపంతో ఏపీడీడీసీఎఫ్‌కు డెయిరీ ఆస్తులను తాకట్టు పెట్టి రూ.35 కోట్ల అప్పు తీసుకున్నారు. ఈ రుణాన్ని 2018 జూన్ 27న జీవో ఎంఎస్ నంబర్ 26, ఏహెచ్‌డీడీ అండ్ ఎఫ్ కింద విడుదల చేశారు. రుణానికి తాకట్టుగా ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.58.98 కోట్ల విలువైన 8.75 ఎకరాల డెయిరీకి చెందిన భూమిని తనఖా పెట్టారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం తీసుకున్న రుణాన్ని 2020 నవంబర్ నుంచి నెల వారీగా వాయిదాలు చెల్లించేలా మారటోరియం ఉంటుంది. అప్పటి నుంచి నెలకు రూ.18 లక్షలు వాయిదాలుగా చెల్లించాలి. డెయిరీ నిర్వహణతో పాటు ఉద్యోగుల జీతాలు, కరెంటు బిల్లులు, పాడిరైతులకు చెల్లింపులు, రవాణా చార్జీల చెల్లింపులు ఇలా అన్నీ సరిచేసుకుంటూ నెలసరి వాయిదా కింద రూ.18 లక్షలు చెల్లించాలంటే డెయిరీ పూర్తి స్థాయిలో లాభాల బాట పడితే తప్ప చెల్లించే పరిస్థితి ఉండదు. ఇలా 120 సమాన వాయిదాల్లో రుణాన్ని చెల్లించాల్సి ఉంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేయూత..

ఒంగోలు డెయిరీకి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిస్థాయిలో చేయూత అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ప్రత్యేక జీఓ ద్వారా రూ. 69 కోట్లు విడుదల చేశారు. దీంతో జీతాలు లేక విలవిల్లాడుతున్న రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. నాడు ఏపీడీడీసీఎఫ్ నుంచి తీసుకున్న రూ.35 కోట్ల అప్పు నేడు వడ్డీతో కలిపి మొత్తం రూ.40 కోట్లు అయింది. దానిని కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. అన్ని రకాల బకాయిలు చెల్లించాలంటే రూ.109 కోట్లు అవసరం ఉందని డెయిరీ పాలక మండలి చైర్మన్, ఏపీడీడీసీఎఫ్ ఎండీ డిసెంబర్ 2020 సంవత్సరంలో ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తక్షణమే బకాయిలు చెల్లించేందుకు రూ. 69 కోట్లు విడుదల చేశారు. వాటిలో బ్యాంకు రుణాలు రూ.18 కోట్లు, ఏపీడీసీఎఫ్ రుణం రూ.20 కోట్లు, ఉద్యోగుల జీతాలు, గ్రాట్యూటీ కలిపి రూ. 8 కోట్లు, పాలు సరఫరా చేసిన కొన్ని కంపెనీలకు రూ.11 కోట్లు, రిటైర్డ్, రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించిన ఇతర బకాయిలు చెల్లించేందుకు రూ.10 కోట్లు, ఇతర విద్యుత్ బిల్లులు, మరికొన్ని ఇతర బకాయిల కోసం రూ.2 కోట్లు చెల్లించారు. డెయిరీలో రెగ్యులర్ ఉద్యోగులుగా ఉన్న దాదాపు 100 మందికి వీఆర్‌ఎస్ వర్తింపజేశారు. దీంతో వాళ్లందరికీ అన్ని రకాల ప్రయోజనాలు సమకూర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.12.26 కోట్లు ఇచ్చింది.

దీంతో డెయిరీ పాలకమండలి రెగ్యులర్ ఉద్యోగులకు వాళ్లకు రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్లు అందించనున్నారు. జిల్లాలోని పాడి పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువచ్చి, గ్రామ సీమల్లో పాడిద్వారా రైతులు ఆదాయం సమకూర్చుకునేలా ''అమూల్'' సంస్థను రంగంలోకి దించారు. ఇప్పటికే జిల్లాలో పాలు సేకరణ గణనీయంగా పెంచుకుంటూ పోతున్నారు. గ్రామాల్లో పాల సేకరణ కావాల్సిన మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం అదనంగా రూ.7.74 కోట్లు అందించింది. అమూల్ సంస్థ నిర్వాహకులు ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి జిల్లాలో పాడి పరిశ్రమకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి



ఒంగోలు: వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్‌గా రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి నియమితులయ్యారు. ప్రకాశం జిల్లాతో పాటు ఆయన బాపట్ల, నెల్లూరు, నరసరావుపేట, తిరుపతిలోని కొన్ని నియోజకవర్గాలకు రీజినల్ కోఆర్డినేటర్‌గా ఆయన వ్యవహరిస్తారు. ఆమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అరకు గిరిజన గురుకుల క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

యర్రగొండపాలెం: అల్లూరి సీతా రామరాజు జిల్లాలోని అరకు గిరిజన గురుకుల క్రీడా పాఠశాలలో 5, 6 తరగతుల్లో చేరే విద్యార్థుల ఎంపిక ఈ నెల 26న జరుగుతుందని శ్రీశైలం ఐటీడీఏ పీవో ఎం.రవీంద్రరెడ్డి సోమవారం తెలిపారు. ఈ ఎంపిక యర్రగొండపాలెంలోని గిరిజన గురుకుల విద్యాలయం (పీటీజీ) బాలుర పాఠశాలలో జరుగుతుందని, 3వ జోన్‌లోని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన గిరిజన ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఎస్టీ విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొనటానికి అర్హులన్నారు. ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్, హెచ్‌ఎంలు ధ్రువీకరించిన పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ ఎం.చిట్టిబాబు, సెల్: 8309462537కు సంప్రదించవచ్చని తెలిపారు.

26న జిల్లా స్థాయి కుస్తీ గ్రాప్లింగ్ క్రీడాకారుల ఎంపిక

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కుస్తీ గ్రాప్లింగ్ క్రీడాకారుల ఎంపిక ప్రకాశం జిల్లా గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని జిల్లా కార్యదర్శి పులిచర్ల సురేష్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే బాల బాలికలు 2007 నుంచి 2013–14 సంవత్సరంలోపు జన్మించిన వారై ఉండాలి. ఆధార్ కార్డు, నాలుగు పాస్‌ఫొటోలు తీసుకురావాలి. గతంలో అసోసియేషన్ వారు నిర్వహించిన గ్రాప్లింగ్ పోటీలు, లేదా క్యాంపులో పాల్గొన్న వారై ఉండాలి. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు అనకాపల్లి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే ఏపీ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ గ్రాప్లింగ్ పోటీల్లో ప్రకాశం జిల్లా నుంచి అండర్ 11,13,15 క్యాటగిరీల్లో పాల్గొంటారన్నారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులంతా వివరాలకు ఫోన్: 8919591417 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యలు సహేతుకంగా పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చిన అర్జీల తాలూకు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సహేతుకంగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) అధికారులకు సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. నిర్ణీత సమయంలో పరిష్కరించడం ఎంత ముఖ్యమో పూర్తి స్థాయిలో పరిష్కరించడం అంతే ముఖ్యమన్నారు. అదేవిధంగా స్పందనతో పాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలన్నారు. దీనిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

✦ జరుగుమల్లి మండలం వావిలేటిపాడుకు చెందిన వెంకటలక్ష్మీ రామమోహనరావు స్పందనలో అధికారులను కలిసి గ్రామంలోని మహాత్మాగాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న తాగు నీటి ట్యాంకును ఐదేళ్లు అయినా శుభ్రపరచలేదని తెలుపుతూ ఫిర్యాదు చేశారు. గ్రామం పంచాయతీ నిర్లక్ష్యంగా ఉండటం వలన శుభ్రపరచని ట్యాంకులో నీటిని ప్రజలు తాగుతూ రోగాల బారిన పడుతున్నారన్నారు. పరిశీలించి పరిశుభ్రమైన తాగునీరు గ్రామస్తులకు అందించాలని కోరుతూ అర్జీ అందజేశారు.

✦ కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన శివశంకర్ స్పందనలో అధికారులను కలిసి పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ నిధులతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించారని, వాటికి సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. సర్పంచ్ బిల్లులు మంజూరు కాకుండా ఇబ్బంది పెడుతున్నారని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తా

- పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- వలంటీర్లను నిందించటం మంచి పద్ధతి కాదు
- త్వరలో డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి



లాయరుపేట, నిర్మల్‌నగర్‌లో అర్హులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న బాలినేని, మేయర్ గంగాడ

ఒంగోలు సబర్బన్: నగర ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఈ మేరకు ఒంగోలు నగరంలోని నాలుగు డివిజన్లలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు బాలినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 33, 34, 35, 36 డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న బాలినేని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్న కృత నిశ్చయంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందించటం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అలాంటిది ప్రభుత్వమే మీ వద్దకు వచ్చి సర్టిఫికెట్లు ఇస్తుందంటే పరిపాలన ఏ విధంగా ఉందో అందరికీ అర్థమవుతుందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమం దేశంలోనే ఎక్కడా లేదని గర్వంగా చెబుతున్నామని పేర్కొన్నారు. ఒంగోలు నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. అందుకే సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడి నగర ప్రజల శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.370 కోట్ల నిధులు మంజూరు చేయించానని వెల్లడించారు. అదేవిధంగా ఒంగోలు నగరంలో సొంత ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. యరజర్ల వద్ద స్థల సేకరణ చేసి స్థలం బాగుచేయిస్తే దానిని టీడీపీ నాయకుడు దామచర్ల జనార్దన్ హైకోర్టుకు వెళ్లి అడ్డుకున్నాడని మండిపడ్డారు. కోర్టు కేసువల్ల జాప్యం అవుతుందని భావించి సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రూ.200 కోట్లు సీఎం కేటాయించారని చెప్పారు. ఆ నిధులతో భూములు కొనుగోలు చేసే కార్యక్రమం వేగంగా జరుగుతుందని వివరించారు. ఇళ్లు లేని నిరుపేదలు దాదాపు 28 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టించే కార్యక్రమం వేగం పుంజుకుందన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్లపై నిందలు వేయటం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. కరోనా సమయంలో కూడా మానవతా మూర్తులుగా వలంటీర్లు చేసిన సేవలను విస్మరించరాదని, అలాంటి వారిపై నిందలు వేయటం మానుకోవాలని హితవు పలికారు.

త్వరలో డయల్ యువర్ ఎమ్మెల్యే:

త్వరలో సత్య కేబుల్, వి చానల్ ద్వారా డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చేపడతానని బాలినేని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తీర్చటానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఒంగోలు నగర అభివృద్ధికి వాసన్న ఎంతగానో కష్టపడుతున్నారని కొనియాడారు. అడుగడుగునా టీడీపీ నాయకులు అడ్డుపడుతుంటే వాసన్న వాటన్నింటినీ ఛేదించుకుంటూ ముందుకు పోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్లు ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య, ఢాకా సుజాత, చెన్నుపాటి వేణుగోపాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో
అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి అధికారి డాష్‌బోర్డు పరిశీలించాలి
- కలెక్టర్ దినేష్ కుమార్



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ దినేష్‌కుమార్‌తో జేసీ శ్రీనివాసులు

మద్దిపాడు: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అప్రమత్తతతో మెలగాలని, సమస్యలను కింది స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రయత్నించాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని వెల్లంపల్లి ఆవాస్ హోటల్‌లో సోమవారం సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు అలసత్వం వీడి పని చేయాలన్నారు. స్పందన కార్యక్రమంలో మొత్తం 152 అర్జీలు రాగా ముఖ్యమైనవి కొన్ని..

➤ ఉప్పుగుండూరుకు చెందిన నల్లూరి భద్రయ్య తమ గ్రామంలో తమకు ఉన్న స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించి అద్దెలకు ఇస్తున్నారని.. గతంలో ఉన్న తహశీల్దార్‌కు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోకుండా దౌర్జన్యంగా ఆక్రమించిన వారికి వత్తాసుగా మాట్లాడుతూ కోర్టుకు వెళ్లమని ఉచిత సలహాలు కూడా ఇచ్చారని వాపోయారు. దీనిపై కలెక్టర్ తహశీల్దార్, ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ సమక్షంలో చర్చించగా వారు రాజకీయ ఒత్తిడుల కారణంగా చెప్పడంతో ఏం మాట్లాడుతున్నారంటూ కలెక్టర్ ప్రశ్నించారు.

➤ సీతారాంపురం గ్రామానికి చెందిన కామేశ్వరరావు రీసర్వేలో తన పొలం 30 సెంట్లు తగ్గిందని, దాన్ని పరిశీలించి న్యాయం చేయాలన్నారు.

➤ మల్లవరం పరిధిలోని చెంచిరెడ్డి కుంట సమస్యను ఆ గ్రామస్తులు సర్పంచ్‌తో కలిసి వచ్చి కలెక్టర్‌కు విన్నవించారు. పదేళ్ల నుంచి చెంచిరెడ్డి కుంటకు నీరు వెళ్లే మార్గంలో ఇద్దరు రైతులు ఎత్తుగా మట్టిపోయడంతో సుమారుగా వంద ఎకరాలు నీట మునిగి ఉంటుందని, పొలాలు ఉరకలెత్తిపోతున్నాయని, తమకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.

➤ గుండ్లాపల్లి ఎంపీటీసీ పద్మకుమారి మాట్లాడుతూ తమ గ్రామంలో రోజుల తరబడి విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఒక జేఎల్‌ఎంను నియమించగా ఆయన రాజకీయ పలుకుబడితో వేరే గ్రామానికి వెళ్లిపోయాడని చెప్పారు. తమకు జేఎల్‌ఎంను నియమించాలని కోరడంతో కలెక్టర్ ఎస్‌ఈతో మాట్లాడుతూ జేఎల్‌ఎంలతో కూడా పని చేయించుకోలేకపోతే జీతం ఎందుకు అంటూ ఆగ్రహించారు.

మద్దిపాడు మండలంలో పలు భూసమస్యలపై అర్జీలు రాగా సకాలంలో పరిష్కరించకపోగా భూ సమస్యలు ఉన్నవారు కోర్టులకు వెళ్లాలని ఉచిత సలహాలు ఇవ్వడం పట్ల తహశీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరక్షరాస్యులైన రైతులకు చెప్పే సలహాలు ఇవేనా అంటూ ప్రశ్నించారు. పలు శాఖలకు సంబంధించి అర్జీలు రాగా సగం పైగా అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు జిల్లా స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు ఎంపీడీఓలు, తహశీల్దార్లు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

50 అడుగులు 30 అడుగులయ్యే..!

- జనం ఎక్కువ వచ్చారని చూపించేందుకే..
- సంక్షేమ పథకాలపై ఆత్మస్తుతి..పరనింద
- నాడు గ్రానైట్ పరిశ్రమలపై రాయల్టీ భారం వేసిన బాబు
- అధికారంలోకి వస్తే రాయల్టీ తగ్గిస్తామంటున్న లోకేష్

చీమకుర్తి/మద్దిపాడు/నాగులుప్పలపాడు: చీమకుర్తిలోని మెయిన్ రోడ్డు 50 అడుగులు ఉంటుంది. అయితే నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా అది 30 అడుగులకు కుంచించుకుపోయింది. ఇదీ టీడీపీ మార్కు జిమ్మిక్కు. బస్టాండ్ కూడలిలో సోమవారం సాయంత్రం లోకేష్ సభ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా నాయకులు ఫ్లెక్సీలతో నింపేశారు. తక్కువ మంది జనం వచ్చినా డ్రోన్ షాట్‌లో ఎక్కువ మంది వచ్చినట్టు కలరింగ్ ఇచ్చుకునేందుకే ఈ ప్రయాస అంతా. ప్రతి చోటా జరుగుతున్న తంతు ఇదే. కాకపోతే ఇక్కడ కొంచెం ఎక్కువైంది అంతే. లోకేష్ తన ప్రసంగంలో టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరిస్తూ వైఎస్సార్ సీపీ అమలు చేస్తున్న పథకాలపై విమర్శలు ఎక్కుపెట్టారు. ఈ ప్రసంగంలో ఆత్మస్తుతి- పరనింద ఎక్కువైందని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు. సంతనూతలపాడులో 20 ఏళ్లుగా టీడీపీ జెండా ఎగురలేదని, చిట్టచివరగా 1999లో టీడీపీని గెలిపించారని చెప్పడం ద్వారా ఈ నియోజకవర్గంలో ఆ పార్టీకి బలం లేదన్న విషయాన్ని ఆయనే అంగీకరించినట్టైందని సభకు వచ్చిన వారు గుసగుసలాడుకున్నారు. గ్రానైట్ క్వారీల యజమానులు, ఫ్యాక్టరీల యజమానులకు అనుకూలంగా ఏమైనా ప్రసంగిస్తారని ఒక వర్గం గ్రానైట్ వ్యాపారులు ఆశగా ఎదురు చూశారు. తాము అధికారంలోకి వస్తే రాయల్టీ తగ్గిస్తామని ప్రకటించడంతో వచ్చిన వారు సైతం అవాక్కయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు సమస్యలు పరిష్కరించమని విన్నవించుకుంటే పెడచెవిన పెట్టి 20 శాతం రాయల్టీ విధించిన ఘనత మీదే కదా అని ఈసడించుకున్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఒంగోలు డెయిరీని తెరిపిస్తామంటూ పాడిరైతులకు నమ్మశక్యంగాని హామీలను ఇచ్చారు. టీడీపీ కార్యకర్తలను వేధింపులకు గురిచేసే అధికారులపై టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారిపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేస్తామని, వారి పేర్లను ఎర్రబుక్కులో రాసిపెట్టుకుంటున్నానని రెడ్‌బుక్‌ను బహిరంగ సభలో చూపించారు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి 11.30 గంటలకు చీమకుర్తి ఎస్‌ఎస్‌పీ కాలనీ శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన క్యాంప్ సైట్‌లోకి వెళ్లిన లోకేష్ తిరిగి సోమవారం సాయంత్రం 4.30 గంటలకు బయటకు వచ్చారు. ఆ తర్వాత ఆయన వాకింగ్ మొదలుపెట్టి బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి చేరుకున్నారు. బహిరంగ సభకు చేరుకునే మధ్యలో కార్యకర్తలు, అభిమానులతో సెల్ఫీ కార్యక్రమం ఉంటుందని ప్రకటించారు. అయితే ఎందుకో నిర్వాహకులు దానిని రద్దు చేశారు.



రోడ్డుకు ఇరువైపులా కట్టిన టీడీపీ ఫ్లెక్సీలు

● భక్తి శ్రద్ధలతో పీర్ల ఊరేగింపు



మార్కాపురంలో ఊరేగింపునకు సిద్ధమైన పీర్లు

మార్కాపురం టౌన్: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా సోమవారం మార్కాపురం పట్టణంలో ఖాశీం పీరుకు పగలు ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గొర్లగడ్డ పీర్ల చావిడిలోని గొట్టిపడియ ఖాశీం పీరును వివిధ రకాల పూలు, దట్టీలు, వెండి గొడుగులతో అలంకరించి మఖానం నుంచి బయటకు తీసి మేళతాళాల నడుమ ఘనంగా ఊరేగించారు. భక్తులు పప్పులు బొరుగులు, బెల్లం నైవేద్యంగా సమర్పించారు. పీరుకు ముజావర్లు పాతేహాల్ చదివారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తాళ్లూరు (ముండ్లమూరు): పొలంలో తెగిపడిన విద్యుత్ తీగ కాలికి తగిలి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన తాళ్లూరు మండలం లోని నాగంబొట్ల పాలెం గ్రామంలో సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శనివారపు రమణారెడ్డి(41) ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరారు. గ్రామ సచివాలయ సమీపంలోని పొలంలో రేకుల షెడ్ వద్ద బైక్ నిలిపి బహిర్భూమికి వెళ్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ మోటారు కోసం ఏర్పాటు చేసిన తీగ తెగి పడి కాలికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రి పొద్దుపోయినా భర్త ఇంటికి రాకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు పలుమార్లు ఫోన్ చేశారు. ఫోన్ రింగ్ అవుతోంది కానీ లిఫ్ట్ చేయలేదు. దీంతో చేసేది లేక నిద్రకు ఉపక్రమించారు. సోమవారం ఉదయాన్నే పొలం యజమాని శ్రీనివాసరెడ్డి అటుగా వెళ్లగా రమణారెడ్డి మృతదేహం పడిఉంది. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విగతజీవిగా పడిఉన్న రమణారెడ్డిని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడికి భార్య లక్ష్మీ, కుమార్తెలు వర్షితరెడ్డి, గౌతికారెడ్డి ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మోహనరావు తెలిపారు.

విశ్వనరుడు గుర్రం జాషువా


జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లక్ష్మానాయక్ తదితరులు

ఒంగోలు: కవి గుర్రం జాషువా విశ్వనరుడని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం భవనంలోని గుర్రం జాషువా ప్రాంగణంలో జాషువా 52వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నేత, జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ, కార్యదర్శి ఎండ్లూరి రవికుమార్ తదితరులతో కలిసి సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు మహాకవి జాషువా అద్భుత రచనలు చేశారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కవి ఎజ్రాశాస్త్రి, దళిత సంఘాల నాయకులు రావి నూతల కోటిమాదిగ, ముప్పవరపు గోపి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

యద్దనపూడి: అనారోగ్యాన్ని తాళలేక ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈఘటన మండలంలోని పోలూరు గ్రామంలో జరిగింది. ఎస్సై అనూక్ వివరాల మేరకు.. మండలంలోని పోలూరు గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన పోలూరి బుల్లెమ్మ (50) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా వ్యాధి నయం కాకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని ఈనెల 21వ తేదీ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకుంది. గమనించిన ఇరుగుపొరుగు వారు మంటలార్పి అపస్మారక స్థితిలో ఉన్న బుల్లెమ్మను గుంటూరు జనరల్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతిచెందింది. ఈ మేరకు ఆసుపత్రి వచ్చిన నివేదిక మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ఒంగోలు రైల్వేస్టేషన్ ఆవరణలో వైఎస్సార్ సీపీ శ్రేణుల కోలాహలం


బాలినేనికి గజమాలతో స్వాగతం పలుకుతున్న మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ మీనా తదితరులు

బాలినేనికి అభిమానుల బ్రహ్మరథం

- అడుగడుగునా పూల వర్షం
- రైల్వే స్టేషన్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో కోలాహలం
- విజయసాయిరెడ్డి కలవడం స్నేహపూర్వకమేనన్న బాలినేని

ఒంగోలు: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. విదేశీ పర్యటన ముగించుకున్న బాలినేనిని సాదరంగా స్వాగతించేందుకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద ఎత్తున అభిమానులు, నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉదయాన్నే ఒంగోలు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయనను కలిసేందుకు అభిమానులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనా వెంకట్రావు, నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు నగర కన్వీనర్ కటారి శంకర్, సాంస్కృతిక విభాగం రీజినల్ కోఆర్డినేటర్ బొట్ల సుబ్బారావు, బీసీ విభాగం రీజినల్ కోఆర్డినేటర్ బొట్ల రామారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, టైలర్ల సంక్షేమ బోర్డు రాష్ట్ర చైర్‌పర్సన్ షేక్ సుభాన్‌బీ, మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచారమ్మ, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జిల్లెళ్లమూడి రమాదేవి, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌జలీల్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ తదితరులు పెద్ద ఎత్తున చేరుకుని గజమాలతో బాలినేనిని స్వాగతించారు. రైల్వే స్టేషన్ మొదలు బాలినేని నివాసం వరకు అడుగడుగునా నాయకులు, కార్యకర్తలు బాలినేనిపై అభిమానాన్ని చాటుకుంటూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.


రైలు దిగుతున్న బాలినేనిని కలిసేందుకు అభిమానుల ఉత్సాహం

విజయసాయిరెడ్డితో భేటీ స్నేహపూర్వకమే..

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి తనను కలవడం కేవలం స్నేహపూర్వకమేనన్నారు. అందులో ఎటువంటి రాజకీయ కోణం లేదని చెప్పారు. త్వరలోనే పార్టీ రీజినల్ కోఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి పేరు ప్రకటించనున్నారని, అందులో భాగంగానే తనను కలిసిన సందర్భంలో జిల్లాలోని పరిస్థితులు చర్చకు వచ్చాయన్నారు. ప్రక్షాళన చేయడం అనేది ఏదైనా ఉంటే అది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే చేస్తారని స్పష్టం చేశారు. ప్రతి గడపకూ వెళ్లి వలంటీర్లు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, ప్రజలకు మంచి చేస్తున్న వలంటీర్ల గురించి కొంతమంది తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. లోకేష్ పాదయాత్రను తాము ఎక్కడా ఆపలేదని బాలినేని పేర్కొన్నారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- పోలీస్ సిబ్బందికి ఎస్పీ మలికా గర్గ్ హెచ్చరిక
- సకాలంలో స్పందించని పలువురు అధికారులకు చార్జిమెమోలు జారీ
- పోలీసు స్పందనలో 75 ఫిర్యాదులు


ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పోలీసు స్పందనలో వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు సీఐలు, ఎస్సైలపై ఎస్పీ మలికా గర్గ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. సమస్యలు పరిష్కరించకుండా అలసత్వం ప్రదర్శించడం, స్టేషన్ ఇన్‌చార్జిలు సకాలంలో కేసులు కట్టకపోవడాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ జిల్లా కేంద్రం ఒంగోలుతోపాటు పశ్చిమ ప్రకాశంలోని పలువురు సీఐలు, ఎస్సైలకు చార్జ్ మెమో జారీ చేసినట్లు సమాచారం.

స్పందనకు 75 అర్జీలు

యాక్సిస్ బ్యాంకులో హౌసింగ్ లోన్ ఇప్పిస్తానని చెప్పి నమ్మించి కంభం మండలానికి చెందిన జె.రాజశేఖర్ తన వద్ద నుంచి పలు దఫాలుగా రూ.23.32 లక్షలు తీసుకొని మోసం చేశాడని గిద్దలూరుకు చెందిన టి.కృష్ణ మోహన్ ఎస్పీ మలికాగర్గ్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన ఎస్పీకి ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని అభ్యర్థించారు. మార్కాపురం పట్టణానికి చెందిన భూషణ్ అనే వ్యక్తి తనకు వైద్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.1.50 లక్షలు తీసుకున్నాడని, ఉద్యోగం ఇప్పించకపోవడంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగుతుంటే కేవలం రూ.30 వేలు తిరిగి ఇచ్చాడని పెదారవీడు మండలానికి చెందిన కె.నాగేశ్వరరావు వాపోయారు. వర్షాలు కురుస్తున్నా జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు తరలివచ్చారు. మొత్తం 75 ఫిర్యాదులు రాగా వారి నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ..సమస్య పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని, స్పందన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై ఎప్పటికప్పుడు తనకు నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులు పరిష్కారం అయ్యేంత వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. ఏఎస్పీ (అడిషనల్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే సంచార జాతుల అభ్యున్నతి

- బ్రిటీష్ పాలనలో తీవ్ర అణిచివేతకు గురయ్యాం
- 1952 ఆగస్టు 31న అణిచివేత నుంచి విముక్తులమయ్యాం
- విముక్తికి గుర్తుగా ఈనెల 31న రాజమహేంద్రవరంలో భారీ బహిరంగసభ
- చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ మాటలు నమ్మితే మనల్ని మనం మోసం చేసుకున్నట్లే
- ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ వీరన్న

ఒంగోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సంచార జాతుల అభ్యున్నతి సాధించాయని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలువ గట్లు, పోరంబోకు స్థలాలు, ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసుకుని జీవనం సాగించే పరిస్థితులు నిన్న మొన్నటి వరకు నెలకొన్నాయన్నారు. భూ యజమానులు, ఆక్రమణదారులు వచ్చి దౌర్జన్యంగా గుడిసెలు కూల్చివేస్తే అక్కడ నుంచి మరోచోటకు వెళ్లిపోవడం తప్ప ఆర్థికంగా ఎదగలేక, ఆర్థిక శత్రువును ఎదుర్కోలేక ఎంతో మదనపడ్డామన్నారు. కానీ నేడు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తే అందులో అత్యధిక శాతం సంచార జాతులకు చెందిన వారే ఉండడం నిజంగా సంచార జాతుల అదృష్టమన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు వెళుతున్న పిల్లలను చూసి మా పిల్లలను కూడా బతికుండగా అలా పంపగలమా అన్ని మదనపడ్డామని, కానీ నేడు జగనన్న విద్యాకానుక పేరుతో అవన్నీ అందించి నాడు-నేడుతో కార్పొరేట్ కంటే దీటుగా పాఠశాలలను తయారుచేసిన జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తుంటే దైవమే మా మొర ఆలకిస్తున్నట్లుగా ఉందన్నారు. అణగారిన వర్గాలు సైతం ఆంగ్ల విద్య నేర్చుకోవడం ద్వారా సమసమాజాన్ని జగన్‌మోహన్‌రెడ్డి కోరుతుంటే అందుకు భిన్నంగా చంద్రబాబు అణగారిన వర్గాలు ఎదగకూడదనే కుట్ర పన్నాడని విమర్శించారు. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో చంద్రబాబు అండ్‌కోకు సరైన గుణపాఠం చెప్పేందుకు సంచార జాతుల ప్రజానీకం ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ఆగస్టు 31న భారీ బహిరంగసభ..

రాజులకు సైన్యంగా పనిచేస్తున్న సంచార జాతులతో తమ పాలన సాగదని భావించిన బ్రిటీష్ ప్రభుత్వం 1871లో క్రిమినల్ ట్రయల్స్ యాక్టును తీసుకువచ్చిందని, దాని ప్రకారం పుట్టిన బిడ్డ మొదలు చనిపోయే వృద్ధుని వరకు అందరూ దోషులే అన్నారు. అటువంటి చట్టం సరికాదంటూ అనంత శయన్ అయ్యంగారు కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం 1952 ఆగస్టు 31 నుంచి ఆ చట్టం నుంచి తాము విముక్తలమయ్యామన్నారు.

ఈ నేపథ్యంలోనే సంచార జాతులందరికి సంచార జాతుల స్వతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను తెలియజేసేందుకు ఈనెల 31న రాజమహేంద్రవరంలో భారీ బహిరంగసభను ఏర్పాటు చేస్తున్నామని, జిల్లాల అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎంబీసీ అధ్యక్షుడు మంగరాజు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ముద్రగడ భాగ్యలక్ష్మి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి 11 మంది ఎంపిక


జి సత్యనారాయణరెడ్డి


బాలగోపాల్


మనోహర్


గణేష్ కుమార్

- గణపవరం ఏపీఆర్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

త్రిపురాంతకం: స్థానిక ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థులు 11 మంది ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించి సత్తా చాటారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి దండెబోయిన బాజి, ఎల్.గోపి, బి.వెంకట నాగరాజు, టి.అశోక్, జి.సత్యనారాయణరెడ్డి, బి.అజయ్ నాయక్, పీవీ బాలగోపాల్, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో గణేష్, మేకల మనికంఠ, ఎ.సిద్ధార్థ, మనోహర్ నలుగురు విద్యార్థులు సీట్లు సాధించారు. రాష్ట్రంలో అత్యధిక సీట్లు సాధించిన ప్రభుత్వ పాఠశాలల్లో ఏపీఆర్ స్కూల్ మొదటి స్థానంలో నిలిచింది. కాగా, ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులంతా పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. సన్న, చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీల పిల్లలు పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించి, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించడం విశేషం. విద్యార్థులను ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.


అశోక్


డి బాజి


శిద్దార్థ


గోపి


అజయ్ నాయక్


బి వెంకట నాగార్జున


ఎం మణికంఠ

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

పొదిలి రూరల్: కొనకనమిట్ల మండలం పెదారికట్ల పంచాయతీ గొంటువారిపల్లెకు చెందిన దూలం జనార్ధన్‌రెడ్డి(15) సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. జనార్ధన్‌రెడ్డిని ఇటీవల విజయవాడలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించారు. అక్కడ ఆరోగ్యం సరిగ్గా లేదని మానేయడంతో ఒంగోలులో చేర్పించారు. వారం క్రితం ఇంటికి వచ్చి ఇక కాలేజీకి వెళ్లననడంతో తల్లిదండ్రులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఏమైందో తెలియదు కానీ పొలంలో పురుగు మందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. బంధువులు గమనించి, గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే వెంట వచ్చిన పోలీసుల వాహనంలో పొదిలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతి చెందిన వీరమ్మ

జే.పంగులూరు: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈఘటన మండల పరిధిలోని అలవలపాడు సచివాలయ సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. చందలూరు గ్రామానికి చెందిన అత్తింటి వీరమ్మ (39) తన భర్త నిల్సన్‌తో బైక్‌పై గ్రామం నుంచి వెంకటాపురం బంధువుల ఫంక్షన్‌కు బయలుదేరారు. అలవలపాడు గ్రామంలోకి వచ్చేసరికి ముందు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను దాటే క్రమంలో వస్తున్న నాలుగు చక్రాల వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ వెనక కూర్చున్న వీరమ్మ ఎడమ వైపు బైకు నుంచి కిందకు జారి పడింది. భర్త నిల్సన్ కుడివైపు పడ్డాడు. వెనుక నుంచి ఎడమ వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్.. కింద పడిన వీరమ్మ మీదుగా వెళ్లింది. ఈ ప్రమాదంలో వీరమ్మ తలకు, పొట్టభాగానికి బలమైన గాయాలయ్యాయి. దీంతో వీరమ్మ అపస్మారక స్థితిలోకి వెళ్లింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వీరమ్మను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భర్త నిల్సన్‌కు గాయాలు కాలేదు. మృతురాలు వీరమ్మకు ఒక బాబు, పాప ఉన్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు మంచి పేరు తేవాలి


మాట్లాడుతున్న ట్రైనీ ఎస్పీ అంకితా సురానా, పక్కన కెనరా బ్యాంక్ జీఎం మురళీకృష్ణ

- కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ మురళీకృష్ణ
- బాలుర జెడ్పీ హైస్కూల్లో రూ.10 లక్షలతో నిర్మించిన లైబ్రరీ ప్రారంభం

మార్కాపురం టౌన్: పాఠశాలలో ఉన్న విద్యా సదుపాయాలను ఉపయోగించుకుని కష్టపడి చదివి రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తీసుకునిరావాలని మార్కాపురం బాలుర జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ అచ్యుతుని మురళీకృష్ణ ఆకాంక్షించారు. కెనరా బ్యాంక్ కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా రూ.10 లక్షలతో నిర్మించిన అత్యాధునిక లైబ్రరీని ట్రైనీ ఎస్పీ అంకితా సురానాతో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ జీఎం మాట్లాడుతూ.. ప్రతి బడిలో ఒక గ్రంథాలయం ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. తాను ఉన్నత స్థాయిలో ఉండేలా తీర్చిదిద్దిన పాఠశాలలో తనవంతు బాధ్యతగా గ్రంథాలయాన్ని బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రైనీ ఎస్పీ అంకితా సురానా మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి పాఠ్యపుస్తకాలతోపాటు వివిధ రకాల పోటీ పరీక్షల నిమిత్తం గ్రంథాలయంలోని పుస్తకాలను కూడా ఇప్పటి నుంచే చదవాలని సూచించారు. హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. నూరు వసంతాలు నిండిన బాలుర ఉన్నత పాఠశాలకు చక్కని గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కెనరా బ్యాంక్ జీఎంను సన్మానించారు. కార్యక్రమంలో పొదిలి ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కుందురు శ్రీనివాసరెడ్డి, సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ శాస్త్రి, ఉపాధ్యాయులు జీఎల్ రమేష్ బాబు, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, శివ ప్రసాద్, రత్నరాజు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.